# ముద్దేలనయ్యా - మనసు నీదైయుండ



## సత్యం శంకరమంచి

మోగులూరు నుంచి కనకాంగి తల్లితో శివరాత్రికి అమరావతి వచ్చింది. పినతల్లికి సుస్తీ చేయటంతో రథోత్సవం వెళ్ళిపోయినా అమరావతిలోనే ఉండిపోయారు. పండుగ సందడిలో ఊరిజనం కనకాంగిని అంతగా పట్టించుకోలేదు గాని ఓ రోజు కృష్ణలో స్నానం చేసి బిందెత్తుకుని ఇంటికి వస్తుంటే వూరు వూరంతా తిరణాలయిపోయింది.

కనకాంగి ఐదున్నరడుగుల మనిషి, పద్దెనిమిదేళ్ళ పడుచుదనం. పేరుకు తగ్గట్టు మెరిసిపోయే శరీరం. వాల్జడ వీపుమీద అల్లల్లాడుతుంటే కాలిపట్టీలు ఘల్లుఘల్లున మ్రోగుతుంటే కనకాంగి నడక ఓ సొగసు. అడుగు అడుగుకీ తాళం వేసినట్లు, మెత్త మెత్తగా పాదాలు నేలని ముద్దిడినట్లు, కాలుతీసి కాలు వేయటంలో లయ తొణికినట్లు, చిక్కుపడ్డ చీర అంచుల్ని సవరించుకోటానికి వంగినప్పుడు పాటలో జాగా వచ్చినట్లు సంగీతమయంగా ఉండేది.

వరదపొంగులాంటి యౌవనం వొంటినిండా తుళ్ళి పడుతుండగా గలగల నవ్వేది కనకాంగి. ఆ నవ్వుకు అందరి గుండెలూ ఉలిక్కిపడేవి. పశువులూ, పక్షులూ గిరుక్కున అటు పక్కకి తిరిగి చెవులు రిక్కించేవి. కనకాంగి నవ్వితే ముఖమంతా బుక్కాయి కమ్మినట్లు వెలిగిపోయేది. వొత్తయిన కింది పెదవి విల్లులా వంగేది. ముత్యాల పళ్ళు మురిసిపోయేవి. కళ్ళ కాటుక సంబరాన కరిగిపోయేది. చెక్కిళ్ళు పొంగి జేగురులయ్యేవి. బుగ్గలు విచ్చుకున్న కల్వ పూరేకులయ్యేవి.

అమ్మలక్కలతో ఆ మాటా ఈ మాటా చెప్పకుంటూ ఎత్తయిన వక్షాన్ని కప్పటానికి చాలని పవిట కొంగుని మళ్ళీ మళ్ళీ ముందుకు లాక్కుంటూ, బిందెని ఆ నడుం మీంచి ఈ నడుం మీదికి మార్చుకుంటూ కృష్ణ కెదుతున్న కనకాంగిని చూడటానికి ఇళ్ళలోని జనం వీధిలో కొచ్చారు. ఆకాశం నుంచి నక్షత్రం తెగిపడ్డట్టనిపించింది.

అప్పడే ఏమైంది? కృష్ణలో స్నానం చేసి తడి చీరతో బిందెత్తుకు వస్తుంటే అందరి కళ్ళూ, కనకాంగి మీదే! వొంటి కంటుకున్న తడి చీర నడక సాగనివ్వటంలేదు. అందరూ గుచ్చి గుచ్చి చూస్తుంటే బిందెలోని నీళ్ళలా గుండె అల్లల్లాడుతోంది. నుదుట చెమట పడ్తోంది. ఒక్క ఉదుటన ఇంట్లోకొచ్చిపడి బిందె పక్కన పారేసి 'హమ్మయ్య' అని కూలబడిపోయింది.

ఆ సాయంత్రం గుళ్ళోకి వెళ్తుంటే ముందు జనం. వెనక జనం. కనకాంగి నందిని ముట్టినచోటే తామూ నందిని తాకేవారు. కనకాంగి వినేట్టు పెద్దగా మాట్లాడేవారు. కనకాంగి తమవైపు చూస్తే చాలు సార్ధకత అనుకునేవారు. వాళ్ళను చూసి కనకాంగి సిగ్గుపడలేదు. తను ఎంత అందమైందో ఇన్నాళ్ళకి తెలిసొచ్చింది కనకాంగికి. వాళ్ళని క్రీగంట చూస్తూ ఆడవాళ్ళతో కావాలని కబుర్లు చెప్పింది. కిలకిల నవ్వింది. పకపక నవ్వింది. తెరలు తెరలుగా నవ్వింది. జమ్మి ఆకులు జల్లుమని రాలేటట్లు నవ్వింది. తానో మహారాణిలా అనిపించింది.

ఆ ఠీవితో, ఆ హుందాతో విసవిస నడిచింది. తల విదిలించింది. ఆ విసురులో జడ పక్కనున్న రాయుడికి తగిలింది.

రాయుడికి వొళ్ళు పులకించింది. చకితుడైనాడు. రాత్రికి రాత్రి కనకాంగి తల్లికి కబురు పెట్టాడు. కనకాంగి తల్లి అన్నీ విచారించి ముహూర్తం నిశ్చయించింది.

కనకాంగిని గదిలో చూసి రాయుడు ఆశ్చర్యపోయాడు. రెండు కళ్ళు పట్టని అందం. రాయుడూ అందగాడే! కనకాంగి చిరునవ్వు నవ్వింది. అగరొత్తుల గంధం మత్తుగా ఉంది. కనకాంగి రాయుణ్ణి కళ్ళతో పిలిచింది. రాయుడు నగలు కుమ్మరించాడు. పట్టుచీరలు పాదాల మీదపోశాడు. ఓ మహా సౌందర్యానికి దాసుడైపోయాడు. ఆ దేవత భక్తుణ్ణి తరింపచేసింది.

రోజులు గడుస్తున్నాయి. కనకాంగి కాలమంతా పట్టుచీరలు, నగలు, పువ్వులు, తినుబండారాలు, మంచి గంధాలతో నిండిపోయింది. ఒక్కో సారి రాయుడు జులుం చెలాయించేవాడు. అధికారం ప్రయోగించేవాడు. అప్పుడు కనకాంగి మనస్సు చివుక్కుమనేది. కళ్ళలో నీళ్ళు గిర్రున తిరగ్గా ముఖం తిప్పుకునేది. రాయుడు కరిగిపోయేవాడు. కోరినవన్నీ తెస్తానని బతిమాలుకునేవాడు. కనకాంగి మళ్ళీ మామూలుగా అయిపోయేది.

ఆర్నెల్లు గడిచిపోయాయి. కనకాంగికి ఏ లోటూ లేదు. అంతేకాదు ఎవరికీ పట్టనంత ఐశ్వర్యం! కనకాంగి రాయుడు తాలూకు మనిషని వూరంతకీ తెలిసినా కనకాంగిని ఒక్కసారి చూద్దామన్న కోరికతో ఇంకా జనం ఆ వీధి వెంట తిరుగుతూనే ఉన్నారు. కిటికీవైపు కళ్ళుపెట్టుకు చూస్తూనే ఉన్నారు.

కనకాంగిని గడపదాటి బయటకు రానిచ్చేవాడు కాదు రాయుడు. కొంత కాలానికి కనకాంగికి పట్టుచీరలన్నా, నగలన్నా, మల్లెపూలన్నా ఇష్టంతప్పిపోయింది. ఓ రోజు ఉదయం వాళ్ళమ్మ 'చాకలికి బట్టలు వేయవే!' అంటే దొడ్డి వసారాలో కూర్చుని చాకలి సంగడికి బట్టలు వేస్తోంది. సంగడు బట్టలు సమంగా మడుచుకోవడంలేదు. కనకాంగి వైపే చూస్తున్నాడు. కనకాంగి సాదాచీర కట్టుకుని ఉంది. స్నానం చెయ్యలేదు. జడ వేసుకోలేదు. సంగడు దొంగచాటుగా తన్ని అలా చూస్తుంటే కనకాంగికి ముచ్చటేసింది. సంగడితో కావాలని ఎక్కువసేపు మాట్లాడి పంపేసింది. సాయంత్రం ఉతికిన బట్టలు మళ్ళీ తీస్తుంటే సంగడికి ఎదురుగా కూర్చుని లెక్క వేసుకుంది. చొక్కాలేని సంగడి నల్లటి శరీరాన్ని తదేకంగా చూసింది. బట్టలు సరిచూశాక సంగడేవో కబుర్లు చెప్తే శ్రద్ధగా వింది. ఇంతలో తల్లి పిలిస్తే ఇంట్లోకి వెళ్ళిపోయింది.

రాత్రిళ్ళు నగలూ, పట్టుచీరలూ, పూలూ, అత్తర్లూ ఇచ్చే సుఖంకంటె, ఉదయం సాయంత్రం నీరెండ మీద పడ్తుంటే, సాదాచీర కట్టుకొని సంగడితో ఐదు నిమిషాలు గడపటం గొప్ప హాయిగా ఉండేది కనకాంగికి. ఆ ఐదు నిమిషాల కోసమే రోజల్లా ఎదురు చూసేది కనకాంగి. ఆ ఐదు నిమిషాల కోసమే బతుకుతున్నట్టుండేవాడు సంగడు.

ఓ రోజు సాయంత్రం బట్టలు లెక్క చూసుకొన్నాక వూరు సంగతులు చెప్తున్నాడు సంగడు. బలమైన చేతులు అటు ఇటు వూపుతూ కథ చెప్తున్నాడు. కనకాంగి కళ్ళు మెరిశాయి. అతని వొంటివైపు ఆశగా చూసింది. కథ మధ్యలో ఆపి "ఈ జరీ అంచు ఎంత ఉతికినా సాఫీగా రావటంలేదు సంగా!" అంది.

"ఏది చూణ్ణివ్వండి" అన్నాడు సంగడు.

పవిట సగం విప్పి చీర అంచు చేతికిచ్చింది. సంగడు జరీ సరిచేశాడు. సంగడు ముఖం కనకాంగికి చేరువలో ఉంది. కళ్ళలో కళ్ళుపెట్టి చూసుకున్నారిద్దరూ. సంగడు కనకాంగిని దగ్గరకు తీసుకుంటే ఏమయ్యేదో తెలియదు.

సంగడు ముద్దు పెట్టుకోలేదు.

కనకాంగి ముద్దివ్వలేదు.

ఇద్దరి కళ్ళలో నీళ్ళు.

